సాక్షి విశాఖపట్నం

బుధవారం । 19 । ఫిబ్రవరి । 2025



సీజీఆర్ఎఫ్‌తో 'విద్యుత్' సమస్యల పరిష్కారం 8లో



కళతప్పిన ముడసర్లోవ పార్కు 8లో



అర్మ కొండను అధిరోహించారు 8లో

న్యూస్‌రీల్

ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్, చిత్రంలో డీఆర్వో భవానీ శంకర్

మహారాణిపేట: ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉంటూ, చాకచక్యంగా వ్యవహరించాలని పీవో, ఏపీవో, సెక్టోరల్ అధికారులనుద్దేశించి రిటర్నింగ్ అధికారి, విశాఖ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ తెలిపారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల తొలి విడత శిక్షణ కలెక్టరేట్ మీటింగ్ హాల్లో మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నిసార్లు ఎన్నికల విధుల్లో పాల్గొన్నా.. నిర్లిప్తతకు తావులేకుండా, ఎన్నికల కమిషన్ ఆదేశాలు తుచ తప్పక పాటించాలన్నారు. సొంత నిర్ణయాలు పనికిరావని హెచ్చరించారు. ఏఆర్వో, జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్ భవానీశంకర్, ఎన్నికల శిక్షణ నోడల్ అధికారి సుధాసాగర్, పీవో, ఏపీవో, సెక్టోరల్ అధికారుల సందేహాలను నివృత్తి చేశారు. పోలింగ్ ముందు, పోలింగ్ రోజు, పోలింగ్ తరువాత చేయాల్సిన విధులను పీపీటీ ద్వారా వివరించారు. ఎన్నికల సెల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆట పాటలతో బోధన అవసరం



మాట్లాడుతున్న ఏపీసీ చంద్రశేఖర్ రావు

విశాఖ విద్య: ప్రీ ప్రైమరీ స్థాయిలో చిన్నారులకు ఆటపాటలతో విద్యనందించేలా అంగన్‌వాడీ కార్యకర్తలు కృషి చేయాలని సమగ్ర శిక్ష ఏపీసీ డాక్టర్ జోగ చంద్రశేఖర్ రావు అన్నారు. జిల్లాలోని అన్ని మండల కేంద్రాలలో 776 మంది అంగన్‌వాడీ కార్యకర్తలకు సమగ్ర శిక్ష ద్వారా మంగళవారం నుంచి ఆరురోజుల పాటు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని మండలాల్లో శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేయగా, ఆనందపురం, పద్మనాభం మండలాల్లో ఆయన పర్యటించి, శిక్షణ జరుగుతున్న తీరును పరిశీలించారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష అధికారులు పాల్గొన్నారు.

ఆర్గనైజ్డ్ క్రైం కేసులో ఇద్దరు తైవాన్ వాసుల అరెస్ట్

అల్లిపురం: వ్యవస్థీకృత(ఆర్గనైజ్డ్) క్రైం కేసులో ఇద్దరు తైవాన్ వాసులను సైబర్ క్రైం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి మంగళవారం మీడియాకు తెలిపిన వివరాలు.. గత ఏడాది అక్టోబర్ 16న ఇల్లీగల్ పేమెంట్ గేట్ వే కేసు విచారణలో భాగంగా తైవాన్ జాతీయులైన ము-చి కోనియన్ సేంగ్ అలియాస్ సంగ్ ము-చి అలియాస్ మార్క్, హా-యున్ చాంగ్ అలియాస్ చాంగ్ హోవో-యున్ అలియాస్ మార్కోలు నగరంలోని రాడిసన్ బ్లూ రిసార్ట్స్, సేన్‌ప్రా బే వ్యూ హోటల్‌లో బసచేసి అమాయకులను ఆకర్షించి, వారికి సైబర్ నేరాల్లో శిక్షణ అందించేవారు. దేశంలోని వివిధ వ్యక్తుల సాయంతో పేద, వ్యసనాలకు బానిసలైన వ్యక్తులకు డబ్బు ఆశ చూపి వివిధ బ్యాంకుల్లో సేవింగ్, కరెంట్ ఖాతాలను తెరిచేవారు. వివిధ రకాల మొబైల్ నెట్‌వర్కులకు సంబంధించిన సిమ్‌కార్డులను తీసుకుని, దేశంలో వివిధ ప్రాంతాలలో మకాం వేసి రూ.కోట్ల లావాదేవీలు చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. పోలీసులకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి, డీసీపీ అజిత వేజెండ్ల సహకారంతో మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇప్పటి వరకు ఇద్దరు విదేశీ నిందితులు, ఒక అంతర్ జిల్లా ముద్దాయితోపాటు 26 మంది నిందితులను అరెస్ట్ చేసినట్లు సీపీ వెల్లడించారు.

వైభవం.. రామచంద్రమ్మ ఉత్సవం



పరవాడ మండలం వాడచీపురుపల్లి గ్రామ ప్రజల ఆరాధ్యదైవం రామచంద్రమ్మ పండగ మంగళవారం ఘనంగా జరిగింది. అనకాపల్లి, విశాఖ జిల్లాల నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు ఈ ఉత్సవంలో పాల్గొన్నారు. వేకువ జాము నుంచే అమ్మవారిని దర్శించుకుని పసుపు కుంకుమలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. – పరవాడ

ఎమ్మెల్సీ ఎన్నికకు నిధుల సంకటం



- ఎన్నికల నిర్వహణకు రూ.3 కోట్ల వరకు ఖర్చు?
- పోలింగ్ తేదీ దగ్గర పడుతున్నా విడుదల కాని నిధులు
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్న జిల్లా యంత్రాంగం



మహారాణిపేట: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఎన్నికల తేదీ దగ్గర పడుతోంది. ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం గానీ, ఎన్నికల కమిషన్ గానీ పైసా కూడా విదల్చలేదు. మరోవైపు ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయాలని మాత్రం అధికారులకు ఆదేశాలు జారీ చేస్తుండడం గమనార్హం. దీంతో జిల్లా అధికారులు ప్రత్యామ్నాయ నిధులను ఎన్నికల నిర్వహణకు ఖర్చు చేస్తున్నారు.

ఈ నెల 27న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు జిల్లా అధికారులు సర్వం సిద్ధం చేస్తున్నారు. ఈ నెల 25వ తేదీ సాయంత్రంతో అభ్యర్థుల ఎన్నికల ప్రచారం ముగియనుంది. 27వ తేదీన పోలింగ్, వచ్చే నెల 3వ తేదీన ఓట్ల లెక్కింపు జరగనుంది. ఇప్పటికే కర్నూలు ప్రభుత్వ ముద్రణ శాలలో పోలింగ్‌కు అవసరమైన బ్యాలెట్ పత్రాల ప్రింటింగ్ ప్రక్రియ పూర్తవడంతో అవి విశాఖకు చేరుకున్నాయి. వాటిని ఇక్కడి నుంచి ఉత్తరాంధ్ర జిల్లాలకు పంపించారు. వాస్తవానికి ఈ ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం నిధులు సమకూర్చాల్సి ఉంటుంది. కానీ కూటమి ప్రభుత్వం మాత్రం ఇప్పటి వరకు ఎటువంటి నిధులు విడుదల చేయలేదు. దీంతో జిల్లా అధికారులు తప్పనిసరి పరిస్థితుల్లో ఇతర ఫండ్స్ నుంచి నిధులను మళ్లించి ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లకు ఖర్చు చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం నుంచి నిధులు రాని పక్షంలో మళ్లీ వాటిని సర్దుబాటు చేయడం అధికారులకు తలనొప్పిగా మారే అవకాశముంది.

21,555 మంది ఓటర్లు

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో 21,555 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇందులో 12,948 మంది పురుషులు, 8,607 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. శ్రీకాకుళం జిల్లాలో 4,829 మంది, విజయనగరంలో 4,937, మన్యం పార్వతీపురం మన్యంలో 2,262, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 1,448, విశాఖలో 5,277, అనకాపల్లి జిల్లాలో 2802 మంది ఓటర్లు ఉన్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌లో ఓటర్ల కోసం టెంట్‌లు ఏర్పాటు చేస్తున్నారు. ఎన్నికల సామగ్రి కొనుగోలు, ఓటు వేయడానికి పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లు, తాగునీరు, ఇతర సౌకర్యాలు కల్పిస్తున్నారు. తొలి విడతగా ఎన్నికల నిర్వహణపై మంగళవారం సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మళ్లీ ఈ నెల 24న మరోసారి శిక్షణ ఇవ్వనున్నారు. మార్చి 3న ఆంధ్రా యూనివర్సిటీలో ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు చేస్తున్నారు. వీటికి కూడా నిధులు అవసరం. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో అధికారులు నానా తంటాలు పడుతున్నారు.

ఎన్నికల ఖర్చు రూ.3 కోట్లు!

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు విశాఖ కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ ఎన్నికల ప్రధాన అధికారిగా వ్యవహరిస్తున్నారు. విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల్లో ఎన్నికల నిర్వహణ కోసం మొత్తం రూ.3 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. 123 పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు, ఇతర ఏర్పాట్లకు నిధులు అవసరం. పోలింగ్ సిబ్బంది భోజనాలు, పోలింగ్ తర్వాత టీఏ, డీఏలు కూడా చెల్లించాల్సి ఉంది.

వీసీ పీఠంపై ఐఐటీ ప్రొఫెసర్

- స్థానికుడికే దక్కిన అవకాశం
- ఏయూ ఉపకులపతిగా ఆచార్య రాజశేఖర్ నియామకం



విశాఖ విద్య/సింహాచలం: ఆంధ్ర యూనివర్సిటీ ఉపకులపతిగా ఆచార్య గంగవంశం పైడి రాజశేఖర్ నియమితులయ్యారు. ఈ మేరకు గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కోన శశిధర్ సంయుక్తంగా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆచార్య రాజశేఖర్ ప్రస్తుతం ఖరగ్‌పూర్ ఐఐటీలో మ్యాథ్స్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. కాగా.. ఆచార్య రాజశేఖర్‌ది సింహాచలం. తమ ప్రాంతీయుడు ఏయూ వీసీగా నియామకం కావడం ఎంతో గర్వకారణమని రాజశేఖర్ స్నేహితులు, సన్నిహితులు, గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. రాజశేఖర్ అడవివరం ప్రాథమికోన్నత పాఠశాలలో ఒకటి నుంచి 7వ తరగతి వరకు చదువుకున్నారు. గ్రీన్‌పార్క్ సమీపంలోని సెయింట్ ఆంథోనీ స్కూల్‌లో 8వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యాభ్యాసం చేశారు. ఏవీఎన్ కళాశాలలో ఇంటర్మీడియట్(ఎంపీసీ), డిగ్రీ(బీఎస్సీ) పూర్తి చేశారు. యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో ఎంఎస్సీ, ఎంఫిల్ పూర్తి చేసి అదే యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందారు. గణితంలో ఆచార్య రాజశేఖర్ చేసిన పరిశోధనలు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందాయి.

కుటుంబ నేపథ్యం

ప్రొఫెసర్ రాజశేఖర్ తండ్రి బలరామకృష్ణ అడవివరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు. తల్లి సావిత్రి గృహిణి. రాజశేఖర్ సోదరుడు గిరిధర్ విశాఖ స్టీల్ ప్లాంట్‌లో పనిచేస్తున్నారు. రాజశేఖర్ కుమార్తె కూడా ఖరగ్‌పూర్ ఐఐటీలో విద్యనభ్యసిస్తున్నారు. 2017లో అడవివరంలో జరిగిన గ్రంథాలయ వారోత్సవాల్లో స్థానికులు రాజశేఖర్‌ను ఘనంగా సత్కరించారు. రాజశేఖర్ ఏయూ వీసీగా నియామకం కావడంతో అతని స్నేహితులు పాశర్ల ప్రసాద్, టి.వి.కృష్ణంరాజు, రాజనాల సత్యారావు, వై.డి.వి ప్రసాద్, గ్రామస్తులు కర్రి అప్పలస్వామి, కొలుసు ఈశ్వరరావు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

ఉద్యోగ ప్రస్థానం

- 1997లో యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో గెస్ట్ ఫ్యాకల్టీగా ఉద్యోగ ప్రస్థానం ప్రారంభం..
- 1998 నుంచి 2000 డిసెంబర్ వరకు జపాన్‌లోని టోక్యో యూనివర్సిటీలో పోస్ట్ డాక్టోరల్ ఫెలోగా పని చేశారు.
- 2000 డిసెంబర్ నుంచి 2002 జూన్ వరకు ఐఐటీ ఖరగ్‌పూర్‌లో విజిటింగ్ ఫ్యాకల్టీగా సేవలందించారు.
- 2002 జూన్ నుంచి 2007 ఏప్రిల్ వరకు అక్కడే అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తించారు.
- అనంతరం సెలవులో ఉండి వివిధ అంశాలపై పరిశోధనలు చేశారు.
- 2011 నుంచి 2019 వరకు ఖరగ్‌పూర్ ఐఐటీలోనే ప్రొఫెసర్‌గా పనిచేశారు.
- 2019 ఆగస్టు నుంచి హెచ్ఏజీ స్కేల్‌తో అదే చోట ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు.
- అలాగే ప్రొఫెసర్ రాజశేఖర్ ఖరగ్‌పూర్ ఐఐటీ డీన్‌గా, జేఈఈ మెయిన్స్‌ను ఐఐటీ ఖరగ్‌పూర్ నిర్వహించినప్పుడు చైర్మన్‌గా వ్యవహరించారు.

ఇద్దరు ఆచార్యులకు వీసీలుగా అవకాశం



ప్రసన్నశ్రీ



కూన రాంజీ

ఆంధ్ర యూనివర్సిటీలో విధులు నిర్వర్తిస్తున్న ఇద్దరు ఆచార్యులను రాష్ట్రంలోని వేర్వేరు వర్సిటీలకు వైస్ చాన్సలర్లుగా ప్రభుత్వం నియమించింది. వర్సిటీ విద్యా విభాగంలో పనిచేస్తున్న ఆచార్య కూన రాంజీని మచిలీపట్నం కేంద్రంగా ఉన్న కృష్ణా యూనివర్సిటీకి, ఇంగ్లిష్ విభాగంలో ప్రొఫెసర్‌గా పని చేస్తున్న ప్రసన్నశ్రీను రాజమండ్రిలోని నన్నయ యూనివర్సిటీకి వీసీలుగా నియమించింది. ఆంధ్ర యూనివర్సిటీ నుంచే ఇద్దరు ఆచార్యులకు వీసీలుగా అవకాశం దక్కడం విశేషం.

వీసీ రిలీవ్

ఏయూ ఇన్‌చార్జి వీసీ బాధ్యతల నుంచి ఆచార్య జి.శశిభూషణరావు మంగళవారం రిలీవ్ అయ్యారు. వర్సిటీకి నూతన వీసీని నియమించిన ప్రభుత్వం.. ప్రస్తుత వీసీ వెంటనే రిలీవ్ కావాలని ఆదేశించింది. ఈ మేరకు శశిభూషణరావు వీసీ బాధ్యతల నుంచి వైదొలగి.. తన మాతృస్థానమైన ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా వెళ్లారు. ఇదిలా ఉండగా ఆచార్య శశిభూషణరావుకు ఏయూ పూర్తి స్థాయి వీసీగా అవకాశం కల్పిస్తారనే ప్రచారం జరిగింది. మరో పక్క వీసీ పోస్ట్ కోసమని ప్రస్తుత రిజిస్ట్రార్ ఎస్.ధనుంజయరావు, రెక్టార్ కిశోర్‌బాబు తమ స్థాయిలో లాబీయింగ్ చేశారు. కానీ వీరికి అవకాశం దక్కలేదు. వర్సిటీలో కీలక పోస్టుల్లో ఉన్న వీరిని ఇక్కడ కాకుంటే, రాష్ట్రంలోని ఇతర వర్సిటీలకైనా పరిగణలోకి తీసుకుంటారని అంతా భావించారు. కూటమికి చెందిన కీలక నేతలు వీరికి అభయం కూడా ఇచ్చారనే ప్రచారం సాగింది. కానీ ప్రభుత్వం నుంచి వీరికి ఆశాభంగం తప్పలేదు.

కాగా.. వీసీగా నియమితులైన రాజశేఖర్ ఎప్పుడు విధుల్లో చేరుతారనేది స్పష్టత లేదు. దీనిపై వర్సిటీ వర్గాలకు కూడా సమాచారం లేనట్లుగా తెలుస్తోంది. దీంతో రిజిస్ట్రార్ ధనుంజయరావు పూర్తి స్థాయిలో వర్సిటీ కార్యకలాపాలపై పర్యవేక్షణ చేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి.

66 కేసుల్లో 74 మంది అరెస్ట్

- జనవరిలో 106 చోరీ కేసుల నమోదు
- వీటిలో 66 కేసులను ఛేదించిన పోలీసులు
- రూ.92.04 లక్షలు విలువైన చోరీ సొత్తు స్వాధీనం
- బాధితులకు సీపీ చేతుల మీదుగా సొత్తు అందజేత



చోరీ సొత్తును బాధితురాలికి అందజేస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి



స్వాధీనం చేసుకున్న మొబైల్స్



స్వాధీనం చేసుకున్న ఆభరణాలు, నగదు

విశాఖ సిటీ : నగరంలో నేర నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలిస్తున్నాయని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి పేర్కొన్నారు. మంగళవారం పోలీస్ సమావేశ మందిరంలో రికవరీ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత జనవరి నెలలో 106 చోరీ కేసులు నమోదయ్యాయని, ఇందులో 66 కేసులను ఛేదించి 74 మంది నిందితులను అరెస్టు చేసినట్లు చెప్పారు. వారి నుంచి రూ.92,04,095 చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఇందులో 310.13 గ్రాముల బంగారం, 536.6 గ్రాముల వెండి, రూ.4,56,495 నగదు, 7 బైక్‌లు, ఒక బస్, ఒక కారు, 2 ఆటోలు, 313 మొబైల్ ఫోన్లు, 4 ల్యాప్‌టాప్‌లు, 2 టీవీలు, 10 లారీ బ్యాటరీలు ఉన్నాయని వివరించారు. నగరంలో నేర నియంత్రణకు, అలాగే నిందితులను గుర్తించేందుకు గత జనవరి నెలలో 864 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. అలాగే నేరాలు జరుగుతున్న తీరుపై 251 అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు చెప్పారు. నేరాలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాల్లో ప్రత్యేక పెట్రోలింగ్ ద్వారా నిఘా పెట్టామన్నారు. అనంతరం బాధితులకు సొత్తు అందజేశారు.

రౌడీలు జైల్లో ఉండాలి

రౌడీలు, అసాంఘిక శక్తులు నగరంలో కాదు.. జైల్లో ఉండాలని సీపీ తేల్చి చెప్పారు. ఇప్పటికే విశాఖలో ఏడుగురిపై పీడీ యాక్ట్, ఐదుగురిపై పీఐటీ ఎన్‌డీపీఎస్ చట్టం అమలు చేసినట్లు తెలిపారు. ఇంకా చాలా మందిపై ఈ చట్టాలను అమలు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. రౌడీలను నగరంలో లేకుండా చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు.

బీచ్ రోడ్డుపై ప్రత్యేక శ్రద్ధ

బీచ్ రోడ్డులో కొంత మంది ఆకతాయిలు రేసులు నిర్వహిస్తున్నట్లు ఫిర్యాదు వచ్చినట్లు సీపీ తెలిపారు. నగరంలో పలువురు వాహనదారులు నెంబర్ ప్లేట్లు లేకుండా తిరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఇటువంటి వారిపై కూడా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తేల్చి చెప్పారు. నోవోటెల్ హోటల్ డౌన్‌లో జరిగిన లారీ ప్రమాదం విషయంపై సీపీ స్పందిస్తూ.. ఈ ప్రాంతాన్ని బ్లాక్ స్పాట్‌గా గుర్తించామని, గతంలో జరిగిన ప్రమాదంలో ఒక ఎస్పీ అధికారి తండ్రి మరణించారని గుర్తు చేశారు. భవిష్యత్తులో ఈ తరహా ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై డీసీపీ–1, ఏడీసీపీ ట్రాఫిక్, ఇతర అధికారులు దృష్టి పెట్టారని వెల్లడించారు.

డ్రగ్స్ కేసులో నిందితులను గుర్తించాం

ఇటీవల విశాలాక్షినగర్ ప్రాంతంలో దొరికిన డ్రగ్స్ కేసులో నిందితులను గుర్తించామని సీపీ తెలిపారు. త్వరలో అందరిని అరెస్టు చేస్తామని చెప్పారు. ఒడిశా నుంచి కొంత మంది గంజాయిని విశాఖ మీదుగా రవాణా చేస్తున్నారని, వారిపై నిఘా పెట్టామన్నారు. గోవా, బెంగళూరు నుంచి కొంత మంది సింథటిక్ డ్రగ్స్ నగరానికి తీసుకువస్తున్నట్లు గుర్తించామన్నారు. నగరంలో గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగం, రవాణాను పూర్తిగా నియంత్రించే విషయంపై దృష్టి పెట్టామన్నారు.

క్రికెట్ బెట్టింగ్‌పై ఫిర్యాదు ఇవ్వండి

క్రికెట్ బెట్టింగ్ కారణంగా మోసపోయిన వారు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సీపీ పిలుపునిచ్చారు. నేరుగా పోలీస్‌స్టేషన్‌లో అయినా 7995095799 నెంబర్‌కు అయినా ఫిర్యాదు చేయాలని సూచించారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా ఎవరు క్రికెట్ బెట్టింగ్ నిర్వహించినా కఠినచర్యలు ఉంటాయని హెచ్చరించారు. సోమవారం స్టేషన్ హౌస్ ఆఫీసర్లతో నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో కూడా ఈ క్రికెట్ బెట్టింగ్‌పై ప్రత్యేక ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. అలాగే ఈ బెట్టింగ్ కార్యకలాపాలపై నగర టాస్క్‌ఫోర్స్ ప్రత్యేక నిఘా పెట్టిందన్నారు.

ఇసుక లారీ బీభత్సం

- బ్రేకులు ఫెయిలై.. బీచ్‌రోడ్డులోకి దూసుకుపోయి..
- తప్పిన పెను ప్రమాదం



సర్వీసు రోడ్డులోకి దూసుకుపోయిన లారీ



పార్కులోకి చొచ్చుకెళ్లిన లారీ

అల్లిపురం: మంగళవారం ఉదయం 6.50 గంటలు.. ప్రభాత వేళ సముద్రపు అలలు తీరాన్ని తాకుతుండగా, అంతటా ప్రశాంత వాతావరణం నెలకొంది. ఇంతలో ఒక్కసారి పెద్ద శబ్దం. ఇసుక లారీ సృష్టించిన బీభత్సం. నోవాటెల్ హోటల్ రోడ్డులో పైనుంచి వస్తున్న లారీ బ్రేకులు ఫెయిలై బీచ్‌రోడ్డుపైకి దూసుకొచ్చింది. ఆ సమయంలో బీచ్‌రోడ్డులో వాహనాల నిషేధం అమలులో ఉండటంతో పెను ప్రమాదం తప్పింది. మరో పది నిమిషాల తర్వాత ఈ ఘటన జరిగి ఉంటే, ఊహించని ఘోరం జరిగిపోయేది. ఈ ఘటనలో ఒక పాదచారికి గాయాలు కాగా, డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. పోలీసులు క్రేన్ సాయంతో లారీని తొలగించారు. పోలీసులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాలివీ..

శ్రీకాకుళం నుంచి ఫిషింగ్ హార్బర్‌కు 40 టన్నుల ఇసుకతో ఓ లారీ బీచ్‌రోడ్డు మీదుగా వస్తోంది. బీచ్‌రోడ్డులో నగర ప్రజలు వాకింగ్ చేసుకోవడానికి వీలుగా వేకువజాము 4.30 నుంచి ఉదయం 7 గంటల వరకు, వీఎంఆర్డీఏ పార్కు నుంచి ఎన్టీఆర్ విగ్రహం వరకు భారీ వాహనాల నిషేధం ఉంటుంది. వీఎంఆర్డీఏ పార్కు వద్ద రోడ్డు మూసివేసి ఉండటంతో లారీ డ్రైవర్ ఏయూ మీదుగా పందిమెట్ట పైనుంచి నోవాటెల్ డౌన్‌కు దిగాడు. ఆ సమయంలో లారీకి బ్రేకులు ఫెయిల్ కావడంతో అదుపు తప్పి, బీచ్ వైపు దూసుకుపోయింది. ప్రమాదాల నివారణకు రోడ్డుపై పోలీసులు ఏర్పాటు చేసిన పెద్ద ప్లాస్టిక్ ఇసుక డబ్బాలను ఢీకొట్టింది. ఫుట్‌పాత్ మీదుగా గోడను ఢీకొట్టి, అవతలి వైపు సర్వీసు రోడ్‌లోకి ఎగిరి పడి.. పార్కులోకి చొచ్చుకెళ్లింది. ఆ సమయంలో వాహనాలు, ప్రజల రాకపోకలు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. రెల్లివీధికి చెందిన తుపాకుల వెంకట రవికుమార్ నేవల్ కోస్టల్ బ్యాటరీ నుంచి ఆర్.కె.బీచ్‌కు వాకింగ్‌కు వెళ్తుండగా, ఈ ప్రమాదంలో గాయపడ్డాడు. లారీ డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. పార్కు గోడ దెబ్బతింది. ప్రాణ నష్టం లేకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం అందుకున్న మహారాణిపేట పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని, క్రేన్ సాయంతో లారీని అక్కడి నుంచి తొలగించారు. రవికుమార్‌ను కేజీహెచ్‌కు తరలించి చికిత్స అందించారు. అతని ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గతంలో ఇక్కడే రెండు ప్రమాదాలు

గతంలో ఇదే ప్రాంతంలో రెండు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. స్కూల్ బస్సు ప్రమాదానికి గురి కాగా.. బస్సులో పిల్లలు లేక పోవడంతో ప్రాణనష్టం తప్పింది. మరో ప్రమాదంలో ఓ లారీ బ్రేకులు ఫెయిల్ కావడంతో రక్షణ గోడను ఢీకొట్టి అవతలి వైపు గల సర్వీసు రోడ్డులోకి వెళ్లింది. ఆ సమయంలో ఐపీఎస్ అధికారి తన కుటుంబంతో సహా అక్కడ సేదతీరుతున్నారు. ఈ ప్రమాదంలో అతని తండ్రి చనిపోగా, అధికారికి కాళ్లు విరిగిపోయాయి. ఇక్కడ ప్రమాదాలు జరగకుండా ట్రాఫిక్ పోలీసులు తగిన రక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికులు, పాదచారులు కోరుతున్నారు.

కళతప్పిన ముడసర్లోవ పార్కు


శిథిలమైన విశ్రాంతి షెల్టర్


కూలిన రక్షణ గోడ


నిరుపయోగంగా వాటర్ ఫౌంటైన్..


తుప్పపట్టిన ఆట పరికరాలు


రిజర్వాయరు గట్టుపై పైకప్పు ఎగిరిపోయిన విశ్రాంతి షెల్టర్


తుప్పపట్టి నిరుపయోగంగా మారిన ప్రెజర్ ఫిల్టర్లు


శిథిలమైన పురాతన భవనం

ముడసర్లోవ పార్కు శిథిలమైంది. ఇక్కడ సందర్శకుల కోసం జీవీఎంసీ ఏర్పాటు చేసిన సౌకర్యాలు మూలకు చేరాయి. పిల్లల ఆట పరికరాలు తుప్పపట్టి పాడయ్యాయి. రక్షణ గోడ పలు చోట్ల కూలిపోయింది. విశ్రాంతి షెల్టర్ల పైకప్పులు ఎగిరిపోయాయి. వాటి కింద కూర్చోవడానికి ఏర్పాటు చేసిన రచ్చబండలు శిథిలమయ్యాయి. వాటి గచ్చులు ఊడి పోయాయి. పార్కు మధ్యలో సందర్శకులను కనువిందు చేసే వాటర్ ఫౌంటైన్ మూలకు చేరింది. ఇందులో నీటి పైపులు తుప్పపట్టి పనిచేయడం లేదు. ముడసర్లోవ రిజర్వాయరు గట్టుపై సందర్శకుల కోసం నిర్మించిన విశ్రాంతి షెల్టర్లు,సిమెంట్ బెంచీలు పాడయ్యాయి. దీంతో ఈ పార్కు కళావిహీనమైంది. - ఆరిలోవ/ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

సీజీఆర్ఎఫ్‌తో 'విద్యుత్' సమస్యల పరిష్కారం

సీతంపేట: విద్యుత్ సర్వీస్ కనెక్షన్ ఇవ్వకుండా ఇబ్బంది పెట్టినా, డబ్బులు డిమాండ్ చేసినా, బిల్లింగ్ లోపాలు, విద్యుత్ మీటర్లలో సమస్యలున్నా విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక(సీజీఆర్ఎఫ్)కు ఫిర్యాదు చేయాల్సిందిగా సీజీఆర్ఎఫ్ చైర్‌పర్సన్, విశ్రాంత న్యాయమూర్తి డాక్టర్ బి.సత్యనారాయణ తెలిపారు. అక్కయ్యపాలెం 80 అడుగుల రోడ్‌లోని గౌరీ కల్యాణ మండపంలో తాటిచెట్లపాలెం పరిధి విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీటర్లు కాలిపోవడం, విద్యుత్ వోల్టేజి హెచ్చుతగ్గులు, విద్యుత్ మీటర్లలో లోపాలు, అదనపు లోడు మంజూరు, యజమాని పేరు మార్పు, కొత్త విద్యుత్ సర్వీసులు వంటి ఏ సమస్య అయినా సీతమ్మధార ఈపీడీసీఎల్ కార్యాలయంలోని సీజీఆర్ఎఫ్‌కు నేరుగా రాత పూర్వకంగా గాని, ఆన్‌లైన్, వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు. సమస్యపై విచారణ చేపట్టి వినియోగదారునికి న్యాయం చేస్తామన్నారు. సీజీఆర్ఎఫ్‌కు 2004 నుంచి ఇప్పటి వరకు 8442 ఫిర్యాదులు రాగా వాటిలో 8367 ఫిర్యాదులను పరిష్కరించినట్లు తెలిపారు. తాటిచెట్లపాలెం సెక్షన్ పరిధిలో పలువురు వినియోగదారులు తమ సమస్యలపై ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో సీజీఆర్ఎఫ్ సభ్యులు షేక్ బాబర్, సులేఖ రాణి, మురళీకృష్ణ, ఈఈ టెక్నికల్ ధర్మరాజు, డీఈఈ విద్యాసాగర్, ఏఈ అప్పలరాజు, లైన్‌మన్లు, జేఎల్ఎంలు పాల్గొన్నారు.





ఎగిరే పావురమా..

ఏయూక్యాంపస్ : విశాఖ సాగర తీరం ఉదయాన్నే కపోతాల రాకతో సందడిగా మారుతోంది. సూర్యుడు రాకముందే వందలాది కపోతాలు ఆకాశంలో విహరిస్తూ నగరవాసులను కనువిందు చేస్తున్నాయి. అలల సవ్వడికి తోడు కపోతాల రెక్కల చప్పుడు ఈ ప్రాంతాన్ని ప్రత్యేక అనుభూతితో నింపుతోంది. కొంతమంది పక్షి ప్రేమికులు వేసే గింజలు, మురీలు లాంటి ఆహారాన్ని అందుకొని.. అవి నోట కరుచుకుని గాల్లోకి ఎగురుతుంటే ఆ దృశ్యం అద్భుతంగా ఉంటోంది. ఉదయాన్నే బీచ్‌కు వచ్చే పర్యాటకులు, నగరవాసులు ఈ కపోతాలతో కలిసి ఫొటోలు దిగడానికి ఆసక్తి చూపుతున్నారు.

- ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

ఏయూలో పేలవంగా వజ్రోత్సవాలు


హాజరైన ఆచార్యులు, అతిథులు


ప్రసంగిస్తున్న డాక్టర్ శ్రీనివాసరావు

విశాఖ విద్య: ఆంధ్ర యూనివర్సిటీ జియో ఫిజిక్స్ విభాగం వజ్రోత్సవాలు పేలవంగా సాగుతున్నాయి. వర్సిటీలో జియో ఫిజిక్స్ విభాగం ఏర్పాటై 75 ఏళ్లు పూర్తి చేసుకున్న తరుణంలో మూడు రోజుల పాటు ప్లాటినం జూబ్లీ ఉత్సవాల నిర్వహణకు అధికారులు కార్యాచరణ సిద్ధం చేశారు. మొదటి రోజు ప్రారంభ వేడుక డాక్టర్ వైఎస్ మూర్తి ఆడిటోరియంలో అట్టహాసంగా జరిగింది. రెండో రోజు మంగళవారం ఈ కార్యక్రమాన్ని వర్సిటీలోని జియో ఫిజిక్స్ బ్లాక్‌కు మార్చారు. రెండు హాళ్లలో సెమినార్లు కొనసాగేలా షెడ్యూల్ ఇచ్చారు. ఉపన్యాసాలు ఇచ్చే వారికి, ఆహూతులకు తగిన ఏర్పాట్లు చేశారు. అయితే ఒక హాల్లో మాత్రమే సెమినార్ నిర్వహించగా, రెండో హాల్ నిరుపయోగంగా వదిలేశారు. రెండో హాల్లో సెమినార్ ఇవ్వాల్సిన పలువురు విద్యావేత్తలు, విషయం తెలియక అక్కడే చాలా సేపు కూర్చున్నారు. మధ్యాహ్నం వరకు ఒకే హాల్లో సెమినార్ కొనసాగగా, దానికి కూడా పూర్తి స్థాయిలో ఆహూతులు లేక కుర్చీలు ఖాళీగానే కనిపించాయి. సబ్జెక్టు పరంగా ఎంతో నిష్ణాతులైన వారు తమ అభిప్రాయాలు, అనుభవాలను పంచుకునే సమయంలో, వీటిని సద్వినియోగం చేసుకునే రీతిలో విద్యార్థులనైనా భాగస్వాములను చేయకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. విభాగం భవనం ముందు ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను మధ్యాహ్నం వరకు 58 మంది మాత్రమే సందర్శించారు. మధ్యాహ్నం తరువాత ఏవీఎన్ కాలేజీ విద్యార్థులు తిలకించేందుకు వచ్చారు. ఆంధ్ర యూనివర్సిటీ వందేళ్ల ఉత్సవాలు త్వరలోనే జరగనున్నాయి. ఓ విభాగం నిర్వహించే వజ్రోత్సవాలే ఇలా ఉంటే.. వర్సిటీ వందేళ్ల ఉత్సవాలు ఇంకెలా చేస్తారోనని ఆచార్యులు సైతం పెదవి విరుస్తున్నారు.

బహుళ పంటల విధానంపై అవగాహన కల్పించాలి

కలెక్టర్ హరేంధిర ప్రసాద్


మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మహారాణిపేట: లాభదాయక సాగు విధానాలపై రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులను కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. ఖరీఫ్ సీజన్ యాక్షన్ ప్లాన్‌పై కలెక్టరేట్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన పలు అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. రానున్న ఖరీఫ్ సీజన్ దృష్ట్యా రైతు వారీగా యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని, స్థానిక అవకాశాలను, పరిస్థితులను పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రకృతి సేద్యానికి, మిల్లెట్లు, బహుళ పంటల సాగుకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, ఆ దిశగా రైతుల్లో చైతన్యం తీసుకురావాలని సూచించారు. గ్రామాల్లో ప్రతి ఇంటి వద్ద కంపోస్ట్ పిట్ ఏర్పాటు, కిచెన్ గార్డెన్ల పెంపకం చేసేలా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులకు ప్రత్యేక గ్రూప్‌లను ఏర్పాటు చేయాలని, వారికి అన్ని విధాలుగా సహకారం అందించాలని సూచించారు. రైతు ఉత్పత్తిదారుల సంస్థలు, సమూహాల ఏర్పాటు వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు తెలియజేయాలన్నారు. రైతు సేవా కేంద్రాలు, ఇతర మార్గాల ద్వారా రైతులకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి అప్పలస్వామి, ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు అధికారి మోహన్ రావు, డీఆర్డీఏ పీడీ లక్ష్మీపతి, సాగునీటి పారుదల శాఖ అధికారులు, ఇతర అధికారులు, రైతు ఉత్పత్తిదారుల సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌కు చేరిన 'ఆయుష్' పంచాయితీ

ఆయుష్ ఆర్‌డీడీ, జూనియర్ అసిస్టెంట్ పరస్పర ఫిర్యాదులు


ఆర్‌డీడీకి వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న జూనియర్ అసిస్టెంట్ సుష్మ బంధువులు

పీఎం పాలెం: ఆయుష్ మధురవాడ జోన్ ప్రాంతీయ కార్యాలయ ఉప సంచాలకురాలు(ఆర్‌డీడీ) ఝాన్సీ లక్ష్మీబాయి, అదే కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న దళిత వర్గానికి చెందిన జె.సుష్మ పీఎం పాలెం పోలీస్ స్టేషన్‌లో మంగళవారం పరస్పర ఫిర్యాదులు చేసుకున్నారు. సీఐ బాలకృష్ణ తెలిపిన వివరాలు.. గత ఏడాది నవంబర్‌లో మధురవాడ జోన్ ఆయుష్ ఆర్‌డీడీగా ఝాన్సీ లక్ష్మీబాయి బాధ్యతలు చేపట్టారు. కొంతకాలంగా సిబ్బందితో ఆమెకు పొసగట్లేదు. ఉన్నతాధికారిగా తనకు గౌరవ మర్యాదలు ఇవ్వడం లేదన్న అక్కసుతో దిగువ సిబ్బందిపై రుసరుస లాడుతున్నారని, జూనియర్ అసిస్టెంట్ సుష్మను వేధిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఈ క్రమంలో మంగళవారం లంచ్ సమయంలో అనీజీగా ఉందని, భోజనం చేసేందుకు ఆర్‌డీడీ గదిలోకి వెళ్లగా, తనపై లక్ష్మీబాయి చేయి చేసుకుని, విపరీతంగా దూషించినట్లు సుష్మ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. పై అధికారినన్న కనీస జ్ఞానం లేకుండా తన పట్ల అనుచితంగా ప్రవర్తించి, దాడిచేసి తన దుస్తులు చింపివేసినట్లు ఆరోపిస్తూ ఆర్‌డీడీ ఝాన్సీ లక్ష్మీబాయి కూడా పోలీసులకు ఫిర్యాదు చేశారు. పరస్పర ఫిర్యాదులపై కేసులు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

ట్రాలర్ ఢీకొని యువకుడి దుర్మరణం


మనోహర్ (ఫైల్)

అక్కిరెడ్డిపాలెం: ద్విచక్రవాహనంపై వెళ్తున్న యువకుడిని ట్రాలర్ రూపంలో మృత్యువు కబళించింది. షీలానగర్ పెట్రోల్ బంక్ సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. గాజువాక ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాలివీ.. అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం వెంకయ్యపాలేనికి చెందిన మైలపల్లి మనోహర్ (24) మెరినో సంస్థలో సేల్స్ విభాగంలో పనిచేస్తున్నాడు. విధుల్లో భాగంగా మంగళవారం నగరం నుంచి గాజువాక వైపు బైక్‌పై వెళ్తున్నాడు. షీలానగర్ పెట్రోల్ బంక్ దాటిన తర్వాత వెనుకనే వేగంగా వస్తున్న ట్రాలర్ బైక్‌ను ఢీకొట్టింది. బైక్ అదుపు తప్పడంతో మనోహర్ తూలి లారీ చక్రాల కిందకు వెళ్లిపోయాడు. ఆ సమయంలో మనోహర్ హెల్మెట్ ధరించినా.. లారీ చక్రాల కింద నలిగి హెల్మెట్ ఊడిపోయింది. తలకు, ముఖానికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో గాజువాక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని.. క్షతగాత్రుడిని షీలానగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మార్గమధ్యంలోనే మనోహర్ మృతి చెందాడు. అతని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ కోటేశ్వరరావు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మనోహర్‌కు తండ్రి మైలపల్లి దేముడు, తల్లి దేముడమ్మ, ఒక సోదరి ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

రాష్ట్ర పురుషుల కబడ్డీ జట్టు ఎంపిక


క్రీడా ప్రముఖులతో ఎంపికైన క్రీడాకారుల జట్టు

ఎంవీపీకాలనీ: జాతీయ స్థాయి పోటీలకు ఆంధ్రప్రదేశ్ పురుషుల కబడ్డీ జట్టు ఎంపికైంది. ఈ మేరకు విశాఖ కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి జేవీఎస్ ప్రసాదరెడ్డి తెలిపారు. గత కొన్ని రోజులుగా 19 మంది క్రీడాకారులకు ప్రత్యేక శిక్షణ అందించగా సెలక్షన్ కమిటీ సభ్యులు మంగళవారం 12 మందితో కూడిన తుదిజట్టును ఎంపిక చేశారని పేర్కొన్నారు. ఎంపికైన రాష్ట కబడ్డీ పురుషుల జట్టు ఒడిశాలోని కటక్ వేదికగా జరగనున్న 71వ జాతీయ కబడ్డీ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ తరఫున ప్రాతినిధ్యం వహిస్తుందన్నారు. ఈ నెల 20వ తేదీ నుంచి 23వ తేదీ వరకు కటక్‌లో ఈ పోటీలు జరగనున్నట్లు తెలిపారు. సెలక్షన్ కమిటీ సభ్యులుగా కబడ్డీ నేషనల్ మెడలిస్ట్, విశాఖ కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి ప్రసాదరెడ్డి, అంతర్జాతీయ కబడ్డీ క్రీడాకారులు సీహెచ్ పద్మరాజు, వైవీ శ్రీనివాస్‌లు వ్యవహరించారు. ఎంపికైన రాష్ట్ర జట్టును జి.రామకృష్ణ చౌదరి, లాలం రమేష్, ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి వై.శ్రీకాంత్, సీనియర్ జాతీయ క్రీడాకారుడు వీవీ రమణ, సీహెచ్ పద్మరాజు తదితర క్రీడా ప్రముఖులు అభినందించారు.

బాలిక ఆత్మహత్య


సాస మృతదేహం

సీతమ్మధార: నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం ఓ బాలిక ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాలివి.. అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ, విష్ణు విల్లా అపార్ట్‌మెంట్‌లో పాల్ కుటుంబం నివాసం ఉంటోంది. ఆయన రామాటాకీస్ దరి ఓ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నారు. అతని భార్య పద్మావతి రైల్వే ఉద్యోగి. వీరికి ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె ఇంటర్ చదువుతుండగా, రెండో కుమార్తె కె.సాస(15) పదో తరగతి మధ్యలో ఆపేసింది. సాస ఎవరితో పెద్దగా కలిసేది కాదు. తల్లిదండ్రులతో కూడా ముభావంగా ఉండేది. గత ఏడాది సెప్టెంబర్‌లో స్కూల్ నుంచి టీసీ తీసుకున్న తర్వాత ఇంట్లోనే ఉంటోంది. ఇదిలా ఉండగా మంగళవారం మధ్యాహ్నం తన చిన్ననాటి స్నేహితురాలికి ఫోన్ చేసి ఇంటికి రమ్మని పిలిచింది. కానీ ఆమె తన ఇంటికి రావాలని ఆహ్వానించింది. తనకు కడుపునొప్పి వస్తోందని, నువ్వే రావాలని సాస ఆమెను కోరింది. మధ్యాహ్నం 3 గంటల సమయంలో కుమార్తెకు తల్లి నిమ్మరసం ఇచ్చింది. ఆ తర్వాత తల్లి, నాన్నమ్మ ఇంట్లో ఉన్న సమయంలో బాలిక నాలుగో అంతస్తుకు చేరుకుంది. వాటర్ ట్యాంక్‌పై కళ్లద్దాలు, మొబైల్ ఫోన్ పెట్టి.. అక్కడి నుంచి కిందకు దూకేసింది. ఆమె స్నేహితురాలు ఇంటికి వచ్చి సాస కోసం అడగ్గా బయటకు వెళ్లిందని వారు చెప్పారు. అంతలోనే అందరూ బయటకు వెళ్లి చూడగా సాస నిర్జీవంగా కనిపించింది. వెంటనే బాలికను రైల్వే ఆస్పత్రికి తీసుకెళ్లగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. బాలిక ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. ఇన్‌చార్జి సీఐ దాలిబాబు పర్యవేక్షణలో ఎస్‌ఐ చిన్నంనాయుడు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

24న సర్టిఫికెట్ కోర్సులకు ఇంటర్వ్యూ

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇనిస్టిట్యూట్ (గైస్)లో నిర్వహిస్తున్న స్వల్పకాలిక సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాలకు ఈ నెల 24న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2024–25 సంవత్సరానికి ఏడాది వ్యవధి కలిగిన పారిశ్రామిక భద్రత కోర్సులో 60 సీట్లు, 6 నెలల వ్యవధితో ఫైర్ సేఫ్టీ కోర్సులో 30 సీట్లు, 4 నెలల వ్యవధితో ఆఫీస్ ఆటోమేషన్ కోర్సులో 20 సీట్లు, 3 నెలల వ్యవధితో కెమికల్ సూపర్‌వైజరీ ప్రోగ్రామ్‌లో 20 సీట్లు ఉన్నాయన్నారు. ఈ కోర్సుల్లో చేరేందుకు ఆసక్తి ఉన్నవారు టెన్త్ పాస్/డిప్లొమా/ఇంటర్/డిగ్రీ సర్టిఫికెట్, ఆధార్, రెండేళ్ల పారిశ్రామిక అనుభవ ధ్రువీకరణపత్రం ఒరిజినల్‌తో పాటు ఒక సెట్ జెరాక్స్‌తో ఆ రోజు ఉదయం 10గంటలకు నేరుగా గైస్ కార్యాలయానికి హాజరు కావాల్సిందిగా కోరారు.

నేటి నుంచి ఎగ్జిబిషన్

ఏయూక్యాంపస్: ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం మొదటి వార్షికోత్సవం పురస్కరించుకుని ఈ నెల 19 నుంచి 21 వరకు విశ్వప్రియ ఫంక్షన్ హాల్‌లో ఎగ్జిబిషన్, ట్రేడ్ ఫెయిర్ నిర్వహిస్తున్నారు. చేతివృత్తుల వారు తమ ఉత్పత్తులను 65 స్టాళ్లలో ప్రదర్శించనున్నారు.

అర్మకొండను అధిరోహించారు

సింధియా: తూర్పు నావికాదళ పరిధిలోని మెటీరియల్ ఆర్గనైజేషన్ విభాగ సిబ్బంది రాష్ట్రంలోని ఎత్తైన శిఖరమైన అర్మ కొండను మంగళవారం అధిరోహించారు. అడ్వెంచర్ యాక్టివిటీస్‌లో భాగంగా అర్మ కొండ ట్రెక్కింగ్ యాత్రను విజయవంతంగా పూర్తి చేసినట్లు నేవీ వర్గాలు తెలిపాయి.